


# BNS
## BHARAT NEWS SPECTRUM
### ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక - 48 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 21-02-2026 శనివారం పేజీలు : 6

## 'అబద్ధాల అడ్రస్ బొత్స'

□ నెయ్యి వివాదంపై నారా లోకేశ్ ట్విట్టర్ అటాక్!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో శుక్రవారం చోటుచేసుకున్న హైడ్రామా సభ వెలుపల సోషల్ మీడియా వేదికగా ముదిరింది. తిరుమల లడ్డూ నెయ్యి సరఫరాలో 'హెరిటేజ్' సంస్థ ప్రమేయం ఉందంటూ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన ఆరోపణలపై మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బొత్స వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు.

**హెరిటేజ్ ప్రతిష్టను దెబ్బతీయొద్దు**

హెరిటేజ్ ఫుడ్స్ ఎప్పుడూ టీటీడీ టెండర్లలో పాల్గొనలేదని, నెయ్యి సరఫరా చేయలేదని లోకేశ్ స్పష్టం చేశారు. "మీ అవినీతి పాలనలో అపవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదాన్ని మేము ప్రక్షాళన చేస్తుంటే, తట్టుకోలేక అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఒక ప్రతిపక్ష నేత హోదాలో ఉండి కనీస ఆధారాలు లేకుండా ఒక సంస్థపై బురదజల్లడం బొత్స స్థాయికి తగదని హితవు పలికారు.

2 లో

# ఐటీ దిగ్గజాలతో
# రేవంత్, బాబు భేటీ..
## తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడుల వెల్లువ!



న్యూఢిల్లీ (బిఎన్ఎస్): దేశ రాజధానిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సమ్మిట్ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల రాకతో సందడిగా మారింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు ఇద్దరూ ఈ సదస్సులో పాల్గొని, భవిష్యత్ టెక్నాలజీ రంగంలో తమ రాష్ట్రాలకున్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పారు. అంతర్జాతీయ ఐటీ ప్రముఖులతో వేర్వేరుగా సమావేశమై, తమ రాష్ట్రాల్లో ఏఐ హబ్‌ల ఏర్పాటుకు ఆహ్వానం పలికారు.

**హైదరాబాద్‌ను 'ఏఐ సిటీ'గా మారుస్తాం: రేవంత్ రెడ్డి**

సదస్సులో ప్రసంగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ ఏఐ రాజధానిగా మార్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు. హైదరాబాద్ సమీపంలో నిర్మించబోతున్న 200 ఎకరాల 'ఏఐ సిటీ' ప్రాజెక్టు గురించి ఐటీ దిగ్గజాలకు వివరించారు. "సాంకేతికత కేవలం ధనికులకు మాత్రమే కాదు, సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడాలి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఏఐ వినియోగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు.

2 లో

## లడ్డూ వివాదంపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు



అమరావతి (బీఎన్ఎస్) శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రత మరియు నెయ్యి కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొద్ది నెలలుగా రాజకీయంగా, ఆధ్యాత్మికంగా పెను సంచలనం సృష్టిస్తున్న ఈ వివాదం ఇప్పుడు విచారణ దశకు చేరుకుంది.

**వివాదానికి మొదలు**

ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు, ఈ అంశాన్ని బయటకు తీశారు. దీని మీద అప్పట్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూలో జంతు స్రావాలు కలిశాయంటూ ఆరోపించారు. దీని మీద కలకలం రేగింది. ప్రభుత్వం తరపున దర్యాప్తునకి ఆదేశించారు. ఈలోగా అక్కడ ఈవో శ్యామలరావు కు ట్రాన్స్ ఫర్ అయింది.

**తెలుగుదేశం వర్సెస్ వైసీపీ: మాటల యుద్ధం**

ఈ అంశంపై టీడీపీ, వైసీపీల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం సాగుతోంది. వైసీపీ హయాంలో అపవిత్రత జరిగిందని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని టీడీపీ మండిపడుతోంది.

4 లో

# ఢిల్లీలో రాజకీయ రణం

□ ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శన..

□ రాహుల్ ఇంటి ముందు బీజేపీ నిరసన!



న్యూఢిల్లీ (బిఎన్ఎస్): దేశ రాజధానిలోని భారత్ మండపంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' రాజకీయ రణక్షేత్రంగా మారింది. అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు, విదేశీ ప్రతినిధులు కొలువుదీరిన వేళ, శుక్రవారం మధ్యాహ్నం అనూహ్యంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సమ్మిట్ వేదికపైకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. దీనికి ప్రతిచర్యగా బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసాన్ని ముట్టడించడంతో ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

2 లో

# వైసీపీది 'అపవిత్ర' రాజకీయం

□ మండలి పరిణామాలపై ధ్వజమెత్తిన కూటమి నేతలు!



అమరావతి(బిఎన్ఎస్): శాసనమండలి వేదికగా శుక్రవారం వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరుపై కూటమి నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని, కేవలం తమ తప్పులను కప్పుపుచ్చుకోవడానికే దేవుడిని అడ్డం పెట్టుకుంటున్నారని మండిపడ్డారు.

**పాదరక్షలతో దేవుడి పటాలా? – పయ్యావుల కేశవ్**

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ వైసీపీ సభ్యుల చర్యలను తీవ్రంగా ఖండించారు. "సభలోకి పాదరక్షలు ధరించి వచ్చి, వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను పట్టుకోవడం హిందూ ధర్మాన్ని అవమానించడమే. భక్తి లేని వారు భక్తుల వేషం వేస్తున్నారు" అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కల్తీపై ఆధారాలు బయటపడుతుంటే, చర్చ నుంచి తప్పించుకోవడానికే సభలో గందరగోళం సృష్టించారని ఆయన ఆరోపించారు.

2 లో

## దేవాదుల ప్రాజెక్టుపై అంత నిర్లక్ష్యం ఎందుకు?: హరీశ్‌రావు



హనుమకొండ: దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. వరంగల్ జిల్లాలో దేవాదుల పరిధి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేవాదుల పనులు నత్తనడకన నడిచాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచినట్లు చెప్పారు.

5 లో

# మండలిలో సెగలు
## టీడీపీ-వైసీపీ సభ్యుల మధ్య రణరంగం!



అమరావతి (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి శుక్రవారం నాటి సమావేశం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కొనుగోళ్ల చుట్టూ సాగిన చర్చ చిలికి చిలికి గాలివానగా మారింది. ముఖ్యంగా 'హెరిటేజ్' సంస్థను ఈ వివాదంలోకి లాగడంపై అధికార పక్షం తీవ్రంగా విరుచుకుపడగా, ప్రభుత్వం తప్పు చేస్తోందంటూ వైసీపీ సభ్యులు సభను హోరెత్తించారు.

వాయిదా తీర్మానం తిరస్కరణతో మొదలైన రచ్చ సభ ప్రారంభం కాగానే వైసీపీ సభ్యులు తిరుమల నెయ్యి కొనుగోలులో అక్రమాలు జరిగాయని, దీనిపై చర్చించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు. అయితే, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు దీనిని తిరస్కరించడంతో వైసీపీ సభ్యులు పోడియం వద్దకు దూసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి ధర తక్కువగా ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 'రివర్స్ టెండరింగ్' పేరుతో ధరలను భారీగా పెంచిందని, ఇది కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికేనని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు.

2 లో

# త్వరలో 'మోదీ–ట్రంప్' భేటీ
## : ప్రపంచ వేదికపై భారత్-అమెరికా సరికొత్త అధ్యాయం!



న్యూఢిల్లీ (BNS): ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. త్వరలోనే భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశం కానున్నట్లు అమెరికా రాయబారి సెర్గియో గోర్ సంకేతాలిచ్చారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026'లో పాల్గొన్న ఆయన, ఈ ఇద్దరు దిగ్గజ నేతల భేటీపై కీలక వ్యాఖ్యలు చేశారు. "సరైన సమయంలో ఈ సమావేశం జరుగుతుంది.. వేచి చూడండి (స్టే ట్యూన్డ్)" అని ఆయన పేర్కొనడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది.

**ఆహ్వానాన్ని మన్నించిన ట్రంప్**

ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలోనే భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ఏడాది (2025) ఫిబ్రవరిలో వాషింగ్టన్ డి.సి.లో మోదీతో జరిగిన భేటీని ట్రంప్ గుర్తు చేసుకున్నారని, భారతీయ సంస్కృతి, ఇక్కడి శక్తిసామర్థ్యాలు అంటే ఆయనకు ఎంతో ఇష్టమని సెర్గియో గోర్ వెల్లడించారు. ఈ పర్యటనకు సంబంధించి అధికారిక తేదీలు ఖరారు కానప్పటికీ, దౌత్యపరమైన కసరత్తులు ఇప్పటికే వేగవంతమయ్యాయి.

2 లో

# 'హెరిటేజ్' నోటీసులకు భయపడను..

□ నిజాలు చెప్పి తీరుతా: మండలి వెలుపల బొత్స సత్యనారాయణ



అమరావతి(బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో శుక్రవారం అధికార, ప్రతిపక్షాల మధ్య సాగిన నెయ్యి వివాదం సభ వెలుపలకు పాకింది. సభ వాయిదా పడిన అనంతరం ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

5 లో

# ఐటీ దిగ్గజాలతో రేవంత్, బాబు భేటీ.. తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడుల వెల్లువ!

మొదటి పేజీ తరువాయి

ఐటీకి బ్రాండ్ అంబాసిడర్ బాబు: ఏపీలో నెక్ట్స్ లెవల్ ప్లాన్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనదైన శైలిలో ఐటీ రంగంపై విజన్‌ను పంచుకున్నారు. గతంలో హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను డీప్ టెక్, ఏఐ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కేవలం ఒక టెక్నాలజీ కాదు, అది ఒక గేమ్ ఛేంజర్. ఏపీలో ప్రతి ఇంట్లోనూ ఒక ఐటీ నిపుణుడు ఉండేలా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం" అని ఆయన వివరించారు.

ఐటీ ప్రముఖులతో కీలక భేటీలు

సదస్సు అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా (NVIDIA) వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రేవంత్ రెడ్డి గ్లోబల్ టెక్ కంపెనీలను హైదరాబాద్‌కు ఆహ్వానించగా, చంద్రబాబు విశాఖపట్నంలో ఏఐ క్లస్టర్లు, డేటా సెంటర్ల ఏర్పాటుపై చర్చించారు. పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు కల్పిస్తామని ఇరువురు నేతలు హామీ ఇచ్చారు.

సాంకేతికతతో పాలనలో పారదర్శకత

పాలనలో ఏఐని భాగస్వామ్యం చేయడం ద్వారా అవినీతిని తగ్గించి, పౌర సేవలను వేగవంతం చేయవచ్చని నేతలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఏఐ పాలసీని విడుదల చేయగా, ఏపీ ప్రభుత్వం కూడా త్వరలోనే సమగ్రమైన ఏఐ పాలసీని తీసుకురాబోతున్నట్లు సమాచారం. రైతుల దిగుబడి అంచనా నుంచి ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వరకు అన్నింటా ఏఐని వాడాలని నిర్ణయించారు.

పోటీతత్వంతో కూడిన సహకారం

రెండు రాష్ట్రాల మధ్య పెట్టుబడుల కోసం ఆరోగ్యకరమైన పోటీ నెలకొనడంపై ఐటీ రంగ నిపుణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పునాదులు పడగా, ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఏఐ రేసులో దూసుకుపోవడం విశేషం. రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణాలో ఉన్న మానవ వనరుల గురించి నొక్కి చెప్పగా, బాబు తన అనుభవం మరియు విజన్‌ను ప్రధానంగా ప్రస్తావించారు.

ఢిల్లీలో తెలుగు వెలుగులు

ఈ సదస్సులో కేంద్ర మంత్రులతో పాటు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. తెలుగు ముఖ్యమంత్రుల ప్రసంగాలు, వారి ఉత్సాహం చూసి పారిశ్రామికవేత్తలు ఆకట్టుకున్నారు. ఈ పర్యటన ద్వారా రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు వేల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

# మండలిలో సెగలు:

## టీడీపీ-వైసీపీ సభ్యుల మధ్య రణరంగం!

మొదటి పేజీ తరువాయి




దేవుడి చిత్రపటాల ప్రదర్శన.. అపచారమన్న ప్రభుత్వం

వైసీపీ ఎమ్మెల్సీలు శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాలను చేతబూని సభలో నిరసన తెలపడం తీవ్ర కలకలం రేపింది. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "పాదరక్షలు ధరించి సభలో దేవుడి పటాలు పట్టుకోవడం హిందూ ధర్మానికి అపచారం" అని ఆయన మండిపడ్డారు. రాజకీయాల కోసం భక్తిని, దేవుడిని వాడుకోవడం తగదని హితవు పలికారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య తోపులాట జరిగినంత పని అయింది. సభ్యులు పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది.

'హెరిటేజ్' ప్రస్తావనపై వాడీవేడీ చర్చ

వైసీపీ సభ్యులు మాట్లాడుతూ.. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న 'ఇందాపూర్ డైరీ'కి, ముఖ్యమంత్రి కుటుంబ సంస్థ అయిన 'హెరిటేజ్ ఫుడ్స్'కు మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్రంగా స్పందించారు. "హెరిటేజ్ సంస్థ గత 32 ఏళ్లలో ఎప్పుడూ టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదు, అసలు ఆ సంస్థ నెయ్యి టెండర్లలోనే పాల్గొనలేదు" అని స్పష్టం చేశారు. కేవలం ముఖ్యమంత్రి ప్రతిష్టను దెబ్బతీయడానికే లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు.

ప్రభుత్వం వర్సెస్ ప్రతిపక్షం: సభ వాయిదా

ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ విచారణ జరుగుతోందని, అది తేలిపోతుందనే భయంతోనే వైసీపీ ఇలాంటి డ్రామాలు ఆడుతోందని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు, తమ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం దాడులకు దిగుతోందని వైసీపీ ఆరోపించింది. ఉభయ పక్షాల మధ్య వాగ్వాదం శృతిమించడంతో చైర్మన్ సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరకు ఎలాంటి చర్చా లేకుండానే సభలో తీవ్ర ఉద్రిక్తతల మధ్యే ఇతర అంశాల వైపు మొగ్గు చూపారు.

# 'అబద్ధాల అడ్రస్ బొత్స': నెయ్యి వివాదంపై నారా లోకేశ్ ట్విట్టర్ అటాక్!

మొదటి పేజీ తరువాయి



అక్కడ లేని బంధాన్ని వెతుకుతున్నారు

మహారాష్ట్రకు చెందిన ఇందాపూర్ డైరీకి, హెరిటేజ్ సంస్థకు ముడిపెడుతూ బొత్స చేసిన వ్యాఖ్యలను లోకేశ్ ఎద్దేవా చేశారు. "దేశంలో ఉన్న ప్రతి డైరీకి హెరిటేజ్‌తో సంబంధం అంటగట్టడం మీ అజ్ఞానానికి పరాకాష్ట. ఇందాపూర్ డైరీకి, మా కుటుంబ సంస్థకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవు. తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇప్పటికే సంస్థ హెచ్చరించింది" అని లోకేశ్ గుర్తుచేశారు.

గత ప్రభుత్వ పాపాలు కడిగేస్తున్నాం

వైసీపీ హయాంలో జరిగిన కల్తీ నెయ్యి సరఫరా గురించి లోకేశ్ తన పోస్ట్‌లో ప్రస్తావించారు. "జగన్ రెడ్డి ప్రభుత్వంలో భక్తుల మనోభావాలతో ఆడుకున్న విషయాన్ని డైవర్ట్ చేయడానికే బొత్స ఇప్పుడు కొత్త డ్రామాలు ఆడుతున్నారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందన్నది జగమెరిగిన సత్యం, దీనిపై విచారణ జరుగుతోంది, త్వరలోనే అసలు దోషులు బయటపడతారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ధరల పెంపుపై లాజిక్ ఏది?

నెయ్యి ధరల పెంపుపై బొత్స చేసిన విమర్శలకు లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. నాణ్యమైన నెయ్యి కావాలంటే మార్కెట్ ధర చెల్లించాల్సి ఉంటుందని, గతంలో తక్కువ ధరకు కొని నాసిరకం నెయ్యిని లడ్డూలో కలిపిన పాపం మీదేనని విమర్శించారు. భక్తుల ఆరోగ్యం, శ్రీవారి ప్రసాద పవిత్రత తమకు ముఖ్యమని, అందుకే క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

వైసీపీ నేతల ద్వంద్వ నీతి

ఒకవైపు దేవుడి చిత్రపటాలు పట్టుకుని సభలో డ్రామాలు చేస్తూ, మరోవైపు అదే దేవుడి ప్రసాదంపై అబద్ధాలు ప్రచారం చేయడం వైసీపీ నేతల ద్వంద్వ నీతికి నిదర్శనమని లోకేశ్ దుయ్యబట్టారు. రాజకీయం కోసం వేంకటేశ్వర స్వామిని వాడుకోవడం మానుకోవాలని, లేదంటే ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నిజాయితీ ఉంటే చర్చకు రండి

"మీ దగ్గర నిజంగా ఆధారాలు ఉంటే సభలో పద్ధతిగా చర్చించండి, అంతే తప్ప మైకులు విరగ్గొట్టి, గందరగోళం సృష్టించి బయటకు వచ్చి మీడియా ముందు అబద్ధాలు చెప్పడం సరికాదు" అని లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తప్పు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని, లేని పక్షంలో బొత్స బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భయం మీకే.. మాకు కాదు

జైలుకు పంపినా భయపడబోమని బొత్స అన్న మాటలకు లోకేశ్ స్పందిస్తూ.. "తప్పు చేసిన వారికే భయం ఉంటుంది. గత ఐదేళ్లలో మీరు చేసిన అరాచకాలకు లెక్కలు తేల్చే సమయం వచ్చింది. అందుకే ఇన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు" అని తన ట్వీట్‌లో తేల్చి చెప్పారు.

# ఢిల్లీలో రాజకీయ రణం



మొదటి పేజీ తరువాయి

షర్టులు విప్పి యూత్ కాంగ్రెస్ నిరసన

భారత్ మండపంలోని ఎగ్జిబిషన్ హాల్-5లోకి చొరబడిన సుమారు 10-15 మంది ఇండియన్ యూత్ కాంగ్రెస్ (IYC) కార్యకర్తలు ఒక్కసారిగా తమ షర్టులు విప్పి అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలు ఉన్న టీషర్టులను చేతబూని, "మోదీ కాంప్రమైజ్ అయ్యారు" అంటూ నినాదాలు చేశారు. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్ దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, భారతీయ పౌరుల డేటాను విదేశీ సంస్థలకు విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు.

భద్రతా వలయాన్ని ఛేదించి..

అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే భారత్ మండపంలోకి నిరసనకారులు క్యూఆర్ కోడ్ పాస్‌లతో సాధారణ సందర్శకుల్లాగే ప్రవేశించినట్లు సమాచారం. హాల్ లోపలికి వెళ్ళాక ఒక్కసారిగా నినాదాలు చేస్తూ వేదికపైకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోలీసులు వారిని బలవంతంగా బయటకు ఈడ్చుకెళ్లి తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు.

బీజేపీ ఎదురుదాడి: రాహుల్ నివాసం ముట్టడి

అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను దిబ్బతీసేలా కాంగ్రెస్ ప్రవర్తించిందంటూ బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనికి నిరసనగా బీజేపీ యువమోర్చా కార్యకర్తలు భారీ సంఖ్యలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసం వద్దకు చేరుకున్నారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి, గో బ్యాక్ నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ ప్రోద్బలంతోనే అర్బన్ నక్సల్స్ తరహాలో యూత్ కాంగ్రెస్ ప్రవర్తించిందని బీజేపీ నేతలు విమర్శించారు. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు అక్కడ భారీగా మోహరించి బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

'టాప్‌లెస్.. బ్రెయిన్‌లెస్.. షేమ్‌లెస్' - సంబిత్ పాత్ర

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. "కాంగ్రెస్ తీరు టాప్‌లెస్ (చొక్కా లేని), బ్రెయిన్‌లెస్ (తెలివి లేని), షేమ్‌లెస్ (సిగ్గులేని)గా ఉంది. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తున్న తరుణంలో ఇలాంటి చర్యలు దేశద్రోహం కిందకే వస్తాయి" అని ఆయన మండిపడ్డారు. దేశాభివృద్ధిని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోందని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వానిది పిఆర్ స్టంట్ - కాంగ్రెస్ కౌంటర్

మరోవైపు కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తల చర్యను సమర్థించుకుంది. "నిరుద్యోగం, దేశ డేటా భద్రతపై యువత తమ గళాన్ని వినిపిస్తే అది తప్పెలా అవుతుంది?" అని ప్రశ్నించింది. ఏఐ సమ్మిట్ కేవలం ఒక పిఆర్ స్టంట్ అని, దేశ ప్రతిభ కంటే విదేశీ ఉత్పత్తులకే ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను లక్ష్యంగా చేసుకుని 'ఏఐ అంటే అశ్విని ఇన్ కాంపిటెంట్' (అశ్విని అసమర్థుడు) అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ ప్రతినిధుల దిగ్భ్రాంతి

సౌత్ కొరియా, అమెరికా, జపాన్ వంటి దేశాల నుంచి వచ్చిన టెక్ దిగ్గజాలు, విద్యావేత్తల సమక్షంలో ఈ గందరగోళం జరగడం చర్చనీయాంశమైంది. అప్పటివరకు సాంకేతిక ఆవిష్కరణలపై చర్చలు జరుపుతున్న ప్రతినిధులు, ఒక్కసారిగా జరిగిన ఈ నిరసనతో ఆశ్చర్యపోయారు. భద్రతా వైఫల్యంపై కూడా కొందరు సందేహాలు వ్యక్తం చేయడంతో, పోలీసులు సమ్మిట్ వేదిక వద్ద భద్రతను రెట్టింపు చేశారు.

రాజకీయ రంగు పులుముకున్న టెక్ సదస్సు

నిజానికి ఈ సదస్సు ఏఐ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటాలి. కానీ, దేశీయ రాజకీయాలు అంతర్జాతీయ వేదికను ప్రభావితం చేయడంతో టెక్ చర్చల కంటే పొలిటికల్ వార్ ఎక్కువగా వినిపిస్తోంది. ఇరు పార్టీల నేతలు సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు కురిపించుకోవడంతో ఢిల్లీలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# త్వరలో 'మోదీ-ట్రంప్' భేటీ

## : ప్రపంచ వేదికపై భారత్-అమెరికా సరికొత్త అధ్యాయం!

మొదటి పేజీ తరువాయి

వాణిజ్య యుద్ధానికి తెర.. కీలక ఒప్పందాలు?

ఇటీవల భారత్-అమెరికా మధ్య సుంకాల విషయంలో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఫిబ్రవరి 6న ట్రంప్ యంత్రాంగం భారత్‌పై ఉన్న టారిఫ్‌లను 25% నుండి 18%కి తగ్గిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీనికి ప్రతిగా రాబోయే ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను భారత్ కొనుగోలు చేయనుంది. ఈ నేపథ్యంలో జరగబోయే మోదీ-ట్రంప్ భేటీలో మరిన్ని భారీ వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

'పాక్స్ సిలికా'తో సరికొత్త సాంకేతిక బంధం

తాజాగా భారత్ అమెరికా నేతృత్వంలోని 'పాక్స్ సిలికా' (Pal Silica) డిక్లరేషన్‌పై సంతకం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మరియు సెమీకండక్టర్ సరఫరా గొలుసులో భద్రత కోసం కుదిరిన ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లనుంది. "మేము మా ఏఐ టెక్నాలజీని ప్రపంచంలోని అందరికీ అందించడం లేదు, ప్రత్యేకంగా భారత్ కోసమే ఈ అవకాశాన్ని తెచ్చాం" అని రాయబారి గోర్ పేర్కొనడం గమనార్హం.

రక్షణ మరియు ఇంధన రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం

మోదీ-ట్రంప్ భేటీలో కేవలం వాణిజ్యమే కాకుండా రక్షణ, ఇంధన రంగాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులపై అమెరికా పెట్టిన అదనపు సుంకాలను తొలగించడం ద్వారా ఇరు దేశాల మధ్య ఇంధన భద్రతపై కొత్త అవగాహన కుదిరింది. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని అరికట్టేందుకు రక్షణ రంగంలో మరిన్ని అత్యాధునిక సాంకేతిక మార్పిడి ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది.

స్నేహమే బలం - దౌత్యమే మార్గం

మోదీ, ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం ఇరు దేశాల బంధానికి బలమైన పునాది అని సెర్గియో గోర్ అభిప్రాయపడ్డారు. "నిజమైన మిత్రుల మధ్య అభిప్రాయభేదాలు సహజం, కానీ వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవడం మా బలం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ప్రారంభంలోనే ఇద్దరు నేతలు ఫోన్ ద్వారా సంభాషించుకున్నారని, ఆ సంభాషణ కొనసాగింపుగానే ఈ శిఖరాగ్ర సమావేశం ఉండబోతోందని ఆయన వివరించారు.

ప్రపంచానికి బలమైన సందేశం

వచ్చే నెలలో (మార్చి 2026) ఇరు దేశాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఆ తర్వాత మోదీ-ట్రంప్ భేటీ జరిగితే, అది కేవలం ద్వైపాక్షిక సంబంధాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ నాయకత్వం వహిస్తున్న తరుణంలో, అమెరికా వంటి అగ్రరాజ్యం భారత్‌ను 'కో-ఫౌండర్'గా పరిగణించడం దౌత్యపరంగా భారత్ సాధించిన గొప్ప విజయం.

ముగింపు: ఉత్కంఠ రేపుతున్న 'రైట్ మూమెంట్'

"స్టే ట్యూన్డ్" అని రాయబారి గోర్ ఇచ్చిన హింట్ ఇప్పుడు ఇరు దేశాల మీడియా వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి కొద్ది రోజుల్లోనే ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ భేటీ ద్వారా భారత్-అమెరికా బంధం "పరిమితులు లేనిది" (Limitless) అని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఇరువురు నేతలు సిద్ధమవుతున్నారు.



# వైసీపీది 'అపవిత్ర' రాజకీయం

మొదటి పేజీ తరువాయి







హెరిటేజ్‌పై అసత్య ప్రచారాలు వద్దు

ముఖ్యమంత్రి కుటుంబ సంస్థ హెరిటేజ్‌ను ఈ వివాదంలోకి లాగడంపై పయ్యావుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ టీటీడీకి నెయ్యి సరఫరా చేయని సంస్థపై బురదజల్లడం బొత్స సత్యనారాయణ స్థాయికి తగదని హితవు పలికారు. "మీ దగ్గర ఆధారాలు ఉంటే సభలో నిరూపించండి, అంతే తప్ప పసలేని ఆరోపణలతో కాలయాపన చేయకండి" అని సవాల్ విసిరారు.

మత విశ్వాసాలతో ఆటలాడకండి - కందుల దుర్గేష్

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ తరపున వైసీపీ తీరును తప్పుపట్టారు. "శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదం. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆటలాడుకున్న వైసీపీకి శిక్ష తప్పదు" అని హెచ్చరించారు. సభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా, కేవలం తమ నాయకుడిని సంతృప్తి పరచడానికే వైసీపీ ఎమ్మెల్సీలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

హిందూ ధర్మ పరిరక్షణే మా లక్ష్యం - సోము వీర్రాజు

బీజేపీ నేత సోము వీర్రాజు మాట్లాడుతూ.. తిరుమల పవిత్రతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. "దేవుడి చిత్రపటాలను రాజకీయ నిరసనలకు వాడుకోవడం అత్యంత దుర్మార్గం. గత ఐదేళ్లలో దేవాలయాలపై జరిగిన దాడులకు సమాధానం చెప్పలేని వైసీపీ, ఇప్పుడు సాకులు వెతుకుతోంది" అని విమర్శించారు.

టీటీడీలో ప్రక్షాళన జరుగుతుంటే ఓర్చుకోలేకనే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు.

చర్చకు మేం సిద్ధం.. పారిపోతోంది మీరే!

ప్రభుత్వం ఏ అంశంపై అయినా చర్చకు సిద్ధంగా ఉందని, కానీ వైసీపీ సభ్యులే చర్చ నుంచి పారిపోతున్నారని నేతలు ఏకగ్రీవంగా పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సభ వెలుపల చేస్తున్న వ్యాఖ్యల్లో ఇవంతైనా నిజం లేదని, పబ్లిసిటీ కోసమే ఆయన తాపత్రయపడుతున్నారని దుయ్యబట్టారు. రివర్స్ టెండరింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంటే, దాన్ని అవినీతిగా చిత్రించడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతున్నారు

మండలిలో పదేపదే సభకు ఆటంకం కలిగించడం ద్వారా వైసీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సభలో హుందాగా వ్యవహరించడం చేతకాక, మార్కెట్ యార్డులా మారుస్తున్నారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం సభ సాగనివ్వకుండా అడ్డుపడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, దీనిపై చైర్మన్ కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నిజాలు నిలకడగా తెలుస్తాయి

తిరుమల లడ్డూ నెయ్యి నాణ్యత విషయంలో సిట్ విచారణ కొనసాగుతోందని, దోషులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని కూటమి నేతలు స్పష్టం చేశారు. "మీ హయాంలో జరిగిన అక్రమాల చిట్టా అంతా బయటకు వస్తుంది. అప్పుడు ప్రజల ముందు ఎక్కడ మొహం చాటుకుంటారో చూస్తాం" అని వైసీపీని ఉద్దేశించి హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా హిందూ ధర్మ వ్యతిరేక చర్యలను సహించేది లేదని తేల్చి చెప్పారు.

# కొల్లూరు వివాదం

# లోకాయుక్త స్పష్టమైన ఆదేశాలు ..!

హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిసరాల్లో ఒకటైన కొల్లూరులో భూముల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సంవత్సరాలుగా అనిశ్చితిలో ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు ఆశతో ఎదురుచూస్తున్నారు. కారణం లోకాయుక్త ఇచ్చిన స్పష్టమైన తీర్పు.

ఈ వివాదంపై విచారణ జరిపిన తెలంగాణ లోకాయుక్త పలు అంశాలను పరిశీలించి కీలక సూచనలు చేసింది. సంబంధిత అధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తిన లోకాయుక్త, న్యాయపరమైన పత్రాలు కలిగిన ప్లాట్ యజమానుల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది.

ప్లాట్ యజమానుల ఆశలు

కొల్లూరులో భూములు కొనుగోలు చేసిన అనేక మంది మధ్యతరగతి కుటుంబాలు సంవత్సరాలుగా తమ ఆస్తులపై అనిశ్చితి ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో లోకాయుక్త తీర్పు వారికి న్యాయపరమైన బలం ఇచ్చింది.




ప్రభుత్వం ముందు ఉన్న బాధ్యత

లోకాయుక్త ఆదేశాలు కేవలం సూచనలు మాత్రమే కావు; అవి ప్రజా న్యాయం దిశగా మార్గదర్శకాలు. ఒక రాజ్యాంగబద్ధ వ్యవస్థగా ప్రభుత్వం వాటిని గౌరవించి అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంది. ప్లాట్ యజమానులు అడుగుతున్నది పెద్ద విషయం కాదు తమకు చట్టబద్ధంగా వచ్చిన హక్కులను రక్షించాలనే విజ్ఞప్తి మాత్రమే. అధికార యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరిస్తే, ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

అభివృద్ధి న్యాయం కలిసే దిశగా

హైదరాబాద్ అభివృద్ధి కథలో కొల్లూరు కూడా ఒక భాగం. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు కాదు; ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా అంతే ముఖ్యము. లోకాయుక్త తీర్పును అమలు చేసి, ప్లాట్ యజమానులకు న్యాయం చేస్తే ప్రభుత్వం మీద ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.

ఇప్పుడు అందరి దృష్టి ప్రభుత్వ చర్యలపై ఉంది. లోకాయుక్త సూచనలను గౌరవిస్తూ స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే, కొల్లూరు వివాదానికి ముగింపు పలకవచ్చు. న్యాయం ఆలస్యం కాకుండా అమలు కావాలని ప్లాట్ యజమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

---

## సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం



విశాఖపట్నం (బిఎన్ఎస్): విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన విద్యా భారతి అఖిల భారతీయ సప్తశక్తి సంగమ్ టోలి సభ్యురాలు మరియు సప్తశక్తి సంగమ్ దక్షిణ క్షేత్ర మరియు దక్షిణ మధ్య క్షేత్ర సంయోజిక్ డాక్టర్ భండారు ధరణి ప్రియ సంయోజక ప్రస్తావన గావించారు . దేశం మొత్తంలో 25 వేల మాతృ సమ్మేళనాల్లో 30 లక్షల మంది మాతృమూర్తులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతంలో 280 కార్యక్రమాలలో 28,000 వేల మాతృమూర్తులు పాల్గొన్నారు అని వివరించారు . కుటుంబ ప్రబోదన్, పర్యావరణ సంరక్షణ తో పాటు మహిళలు చేయవలసిన యోగ దానం గురించి వక్తలు సందేశాలు ఇచ్చారు. మహిళ తనలోని సప్తశక్తులను జాగృత పరుచుకొని దేశానికి ఎలా సేవ చేయాలో వివరించారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న క్రాలేటి వెంకట భాను మాట్లాడుతూ మహిళలు కుటుంబాన్ని పటిష్టం చేసుకోవాలని తెలిపారు ప్రధాన వక్త డాక్టర్ టీ రాధాబాయి (రిటైర్డ్ ప్రిన్సిపల్, టీజేపిఎన్ కళాశాల) ప్రసంగిస్తూ ... భారతీయ సంస్కృతిలో వ్యక్తి తనను తాను నిర్మాణం చేసికొని... తనతో పాటుగా సమాజం, దేశం, విశ్వం, సృష్టిని సమన్వయించు కుంటారని, ఇందులో మహిళల పాత్ర కీలకం అని వివరించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన భాగ్యలక్ష్మి భారత దేశ ఉన్నతిలో మహిళలు సాధించిన విజయాలు, వారి నుండి మనం గ్రహించవలసిన విషయాలను తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంయోజక్ లు అంజలి ప్రసాద్, ఉమా దేవి కార్యక్రమాన్ని యోజనా బద్ధంగా నిర్వహించారు. సుమారు 850 మంది మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న జర్మన్ దేశస్థులు



ప్రముఖ దైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వ స్వామిని శుక్రవారం జర్మన్ రష్యా దేశస్థులు సందర్శించుకున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతమైన ఈ ఆలయం గురించి వినటం కారణంగా ఆలయ దర్శనానికి వచ్చినట్లు జర్మన్ రష్యా దేశస్తులు తెలిపారు. జర్మన్ రష్యా దేశాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యం, అద్భుత శిల్ప సంపద గురించి ఆలయ వైదిక కమిటీ విదేశీ పర్యాటకు వివరించారు.దర్శనం అనంతరం వేద పండితులు, ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు.

## రోడ్ ప్రమాదాల నివారణకు అవగాహన ర్యాలీ



రాజోలు (బీఎన్ఎస్) : రోడ్డు మరణాలు,ప్రమాదాల నివారణ పట్ల రాజోలు సీఐ టి వి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజోలు మండలం ములికిపల్లి,కడలి గ్రామాల మీదుగా చింతలపల్లి రాజోలు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మరియు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడానికి పోలీసులు ఎంత అవగాహన కల్పించినా యువత లో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ములికిపల్లి కడలి గ్రామాల మధ్య తరచు రోడ్డు ప్రమాదాలు జరిగి ఎక్కువగా యువత చనిపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు.ఈ ప్రాంత యువతకు అవగాహన కల్పించేందుకు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ చేపట్టారు.హెల్మెట్ ధరించడం,సీట్ బెల్ట్ వాడకం, వేగ నియంత్రణ మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి పలు అంశాలపై యువతకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ... ఎక్కువగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, విదేశాల్లో ఉంటున్న తల్లిదండ్రులు పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి పలు కారణాల వల్ల యువత పెడత్రోవ పడుతున్నారన్నారు గారాభంతో పిల్లలకు ఖరీదైన సెల్ ఫోన్లు, బైక్ లు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని నరేష్ తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**: సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్**

బ్రహ్మంగారి మఠం(బిఎన్ఎస్): బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని బద్వేలు రోడ్ లో నివాసం ఉంటున్న నాగలూరు వెంకటేశ్ కు చెందిన గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై నిరాశ్రయులుగా ఉన్న వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అగ్నికి ఆహుతి అయిన ఇంటిని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....

బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని బద్వేలు రోడ్ లో బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకొని వచ్చి పాములు పట్టుకుంటూ, పాత సామానులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న నాగలూరు వెంకటేశ్ నివాసం ఉంటున్న గుడిసె గురువారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై ఇంట్లోని విలువైన సామాను, డబ్బులు, సెల్ ఫోన్ వంటి సామాగ్రి మొత్తం కాలిపోయిందని వారు తెలిపారు. వెంకటేష్ కు భార్యతో పాటు 5గురు పిల్లలు ఉన్నారని వారు తెలిపారు. అగ్నిప్రమాద సమయంలో ఇంట్లో బీరువాలో ఉన్న విలువైన వస్తువులు మరియు ఆటో కంతు కోసం దాచుకున్న 20వేల రూపాయలు మరియు ఫ్రిడ్జ్, కూలర్, వంట సామాగ్రి మొత్తం కూడా అగ్నికి ఆహుతి అయి వెంకటేష్ కుటుంబం నిరాశ్రయులుగా మిగిలారని వారు అన్నారు. జీవనాధారం లేక బతుకుదెరువు కోసం గుడిసెలో నివాసం ఉంటూ పాములు పట్టుకుంటూ, ప్లాస్టిక్ వస్తువులను పాత సామానులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వెంకటేష్ కు చెందిన గుడిసె పూర్తిగా కాలిపోవడంతో కుటుంబం మొత్తం దిక్కు తోచని స్థితిలో అయోమయంలో ఉన్నారని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, సాన గోవిందు, ఎర్రంపల్లి అజయ్, కార్యకర్తలు అరవింద్, గురయ్య లు పాల్గొన్నారు.

## రాపూరు-చిట్వేల్ ఘాట్ లో ప్రయాణ అత్యంత ప్రమాదకరం



నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):- నెల్లూరు జిల్లా నుండి ఉమ్మడి కడపజిల్లా మరియు అన్నమయ్య జిల్లా వెళ్లాలంటే వాహనదారులు పెద్ద సాహసమే చేయాల్సిన అవసరం ఉంది,నెల్లూరు జిల్లా రాపూరు నుండి చిట్వేల్ కు వెళ్లాలంటే 19 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు లో ప్రయాణించాలి,ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన మలుపు వద్ద సూచక బోర్డులు లేకపోవడం,కొన్నిచోట్లరోడ్డు కుంగిపోవడం,పిట్టగోడలుపడిపోవడం లాంటి దృశ్యాలు ఘాట్ రోడ్డు లో తారాస పడుతుంటాయి.గత కొన్ని రోజులుగా ఘాట్ రోడ్డు ప్రమాదాల జరుగుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

## తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడలు

**హబీబ్ నగర్ కానిస్టేబుల్ డి.ఏ. కుమార్‌కు రెండో స్వర్ణ పతకం**



బిఎన్ఎస్ :హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సైబరాబాద్ సీఆర్ ప్రధాన కార్యాలయంలో 4వ తెలంగాణ రాష్ట్ర పోలీసు క్రీడా పోటీలు2026 అత్యంత ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ క్రీడలు 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కమిషనరేట్ల నుంచి కానిస్టేబుళ్ల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొని, పలు క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన దేహ దారుఢ్య విభాగంలో గోల్కొండ జోన్ పరిధిలోని హబీబ్ నగర్ పోలీసు స్టేషన్‌కు చెందిన డి.ఏ. కుమార్ అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. విశేషమేమిటంటే, ఈ క్రీడల్లో ఆయనకు ఇది రెండో స్వర్ణ పతకం కావడం గమనార్హం. వరుస విజయాలతో ఆయన తన విభాగంలో తిరుగులేని క్రీడాకారుడిగా నిలిచారు. కుమార్ సాధించిన ఈ విజయం పట్ల పోలీసు ఉన్నతాధికారులు మరియు తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉంటూనే క్రీడల పట్ల మక్కువ చూపి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించడం పట్ల ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలు ముగింపు దశకు చేరుకోవడంతో క్రీడాకారుల మధ్య గట్టి పోటీ నెలకొంది.

# భారతి సిమెంట్స్ వద్ద సెగలు: ఫ్యాక్టరీ గేటును ముట్టడించిన నిర్వాసితులు.. కడపలో భారీ ఉద్రిక్తత!



కడప: జిల్లాలోని కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న భారతి సిమెంట్స్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ స్థాపన సమయంలో భూములు కోల్పోయిన బాధితులు, ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులు ఏకమై పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద మెరుపు ధర్నాకు దిగారు. దశాబ్ద కాలంగా తమకు ఇచ్చిన హామీలను యాజమాన్యం బుట్టదాఖలు చేసిందని ఆరోపిస్తూ వందలాది మంది బాధితులు గేటు ముందు బైఠాయించడంతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

హామీలు అమలు చేయలేదని ఆగ్రహం

పరిశ్రమ స్థాపన కోసం తమ సాగు భూములను, నివాసాలను త్యాగం చేసిన తమకు యాజమాన్యం అన్యాయం చేసిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. "భూములు ఇచ్చేటప్పుడు ఇంటికో ఉద్యోగం, మెరుగైన పరిహారం, గ్రామాల అభివృద్ధి చేస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారు" అని బాధితులు మండిపడ్డారు. నిర్వాసిత కుటుంబాలకు ప్రకటించిన ప్యాకేజీలు నేటికీ పూర్తిస్థాయిలో అందలేదని, స్థానికులకు కాకుండా బయటి వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

చాలని జీతాలు.. కార్మికుల కన్నీరు

మరోవైపు, ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు కూడా ఈ ఆందోళనలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం తమకు ఇస్తున్న వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని, చాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని కార్మికులు వాపోయారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పలుమార్లు యాజమాన్య దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతోనే రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని వారు స్పష్టం చేశారు.

రంగంలోకి భారీగా పోలీసులు

ఆందోళన ఉధృతం కావడంతో ఫ్యాక్టరీ పరిసరాల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. నిరసనకారులు ఫ్యాక్టరీలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా అక్కడికి చేరుకుని బందోబస్తు కట్టుదిట్టం చేశారు. బాధితులు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చర్చలకు పట్టు.. ఆందోళన విరమించేది లేదు!

ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి తమ సమస్యలపై లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని నిరసనకారులు భీష్మించుక కూర్చున్నారు. "అధికారులు ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు తీసుకోవడం కాదు, క్షేత్రస్థాయిలోకి వచ్చి మా కష్టాలు చూడాలి" అని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. అప్పటివరకు ఈ ఆందోళన కొనసాగిస్తామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించడంతో యంత్రాంగం అప్రమత్తమైంది.

కాలుష్య కోరల్లో గ్రామాలు

ఆర్థిక అంశాలతో పాటు, ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల చుట్టుపక్కల గ్రామాలు అతలాకుతలం అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. సిమెంట్ దుమ్ము వల్ల శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని, పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు చేశారు. సామాజిక బాధ్యత (CSR) కింద ఖర్చు చేయాల్సిన నిధులను యాజమాన్యం దారి మళ్లిస్తోందని దుయ్యబట్టారు. ప్రస్తుతం పోలీసుల సమక్షంలో యాజమాన్య ప్రతినిధులు, బాధితుల మధ్య చర్చలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్...!!



అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రాయచోటి డిఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ డిఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో దారిదోపిడీ కేసు వివరాలను వెల్లడించారు. రామపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ భారీ ట్రక్కు దొంగతనం కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి, నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 14వ తేదీన మహారాష్ట్రకు చెందిన ట్రక్కు డ్రైవర్ షేక్ ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, రామాపురం పోలీస్ స్టేషన్ Cr.No. 21/2026, U/s 309(6) BNS-2023 కింద కేసు నమోదైంది. బాధితుడు ట్రక్కులో విలువైన లోహపు ముద్దలను తరలిస్తుండగా, నిందితులు లోన్ ఈఎంఐ బాకీ ఉన్నామంటూ నమ్మించి, అడ్డగించి, డ్రైవర్‌పై దాడి చేసి ట్రక్కుతో సహా పరారయ్యారు.జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో రంగంలోకి దిగిన లక్కిరెడ్డిపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, హెచ్. కృష్ణంరాజు నాయక్, అన్నమయ్య జిల్లా సీసీఎస్ సీఐ యం.చంద్రశేఖర్ టీమ్ మరియు రామాపురం ఎస్ఐ కె.బి.శివకుమార్ బృందాలు ఈరోజు చిట్లూరు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో దాడులు నిర్వహించారు. పారిపోవడానికి ప్రయత్నించిన నలుగురు నిందితులను పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ అయిన నిందితులు (మహారాష్ట్రకు చెందిన వారు):

1. రాజ పుత్ర మల్లారి పిండే (32)
2. నిసార్ రఫీక్ షేక్ (23)
3. లక్ష్మణ్ దిగంబర్ షేక్ (35)
4. సూరజ్ రమేష్ చౌదరి (29)
5. స్వాధీనం చేసుకున్న సొత్తు (విలువ సుమారు రూ. 1.50 కోట్లు)RJ40-GA-6419 నంబరు గల అశోక్ లేలాండ్ ట్రక్కులో ఉన్న 33 లోహపు ముద్దలు (ASX Alloy 1.80% SN Alloy)

నేరానికి ఉపయోగించిన MH45-AL-1923 నంబరు గల స్కార్పియో వాహనం. దాడికి ఉపయోగించిన తోలు కొరడా మరియు 5 సెల్‌ఫోన్లు.క్లిష్టమైన ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రత్యేకంగా అభినందించారు.

# ఘనంగా నేదురుమల్లి జన్మదిన వేడుకలు



ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట, విద్యానగర్ (బి.యన్ యస్):-ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి91వ జయంతి వేడుకలు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లా మంద కుమారులు వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,నేదురుమల్లి గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వాకాడులో వారి నివాసంలో ముందుగా పూజలు చేసి కేకు కట్ చేసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట మండలం విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళభవన్ లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, నేదురుమల్లి గౌతమ్ రెడ్డి తో పాటు యన్.బి.కె.ఆర్.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాట్లాడుతూ ఒక మాజీ ముఖ్యమంత్రి కొడుకు కన్నా ఒక టీచర్ కొడుకు అని చెప్పుకోవడానికి ఇష్టపడతనని చెప్పారు.విద్యానగర్ లో అన్ని విద్యాసంస్థలు అన్ని ఒక యూనివర్సిటీ చేయాలని ఆయన కళ అని దానికి ఆదిశగా అడుగులు పడుతున్నాయి అని,మధ్యలో ఎన్నో ఆటంకాలు వస్తుంటాయి అని వచ్చిన ఆయన కళను పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీ నారాయణరెడ్డి,వైకాపా నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు యన్.బి.కె.ఆర్.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హకీంపేటలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



బిఎన్ఎస్ :హకీంపేటలోని ఏఐఎంఐఎం పార్టీ కార్యాలయం వేదికగా షాదీ ముబారక్ మరియు కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కార్వాన్ శాసనసభ్యుడు కౌసర్ మొహియుద్దీన్ ఈ కార్యక్రమంలో పాల్గొని, షేక్‌పేట మండలానికి చెందిన లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ పంపిణీ సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందింది. ఇందులో 19 షాదీ ముబారక్ చెక్కులు మరియు ఒక కళ్యాణ లక్ష్మి పథకం చెక్కు ఉన్నాయి. పంపిణీ చేసిన ఈ మొత్తం చెక్కుల విలువ రూ. 20,02,320 అని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలు పేద ప్రజల ఇంట్లో పెళ్లిళ్లకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట మండల కార్యాలయ సిబ్బందితో పాటు ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సాయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# లడ్డూ వివాదంపై ఏకసభ్య కమిసన్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి



దీనికి కౌంటర్‌గా, చంద్రబాబు నాయుడు కేవలం రాజకీయ లబ్ధి కోసమే అబద్ధాలు ఆడుతున్నారని, తన కుటుంబ సంస్థ 'హెరిటేజ్' ప్రయోజనాల కోసమే ఇందాపూర్ డైరీ వంటి సంస్థలను తెరపైకి తెచ్చారని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ ఆరోపిస్తున్నారు. దేవుడి ప్రసాదాన్ని రాజకీయం చేయడం దారుణమని ఇరుపక్షాలు పరస్పరం విమర్శించుకుంటున్నాయి.

సీబీఐ మరియు సిట్ (గాxు) విచారణ పరిణామాలు

ప్రభుత్వం తొలుత ఈ కుంభకోణంపై విచారణకు సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని (గాxు) ఏర్పాటు చేసింది. అయితే, ఈ లోపు సుప్రీంకోర్టు జోక్యంతో సీబీఐ, రాష్ట్ర పోలీసులు మరియు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఖీూూాx) ప్రతినిధులతో కూడిన స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఈ విచారణ కొనసాగుతోంది. సిట్ ప్రాథమికంగా సేకరించిన ఆధారాలు, నెయ్యి సరఫరా చేసిన సంస్థల రికార్డులను పరిశీలిస్తోంది.

దినేష్ కుమార్ కమిషన్ బాధ్యతలు

తాజాగా నియమితులైన దినేష్ కుమార్ కమిషన్, గత ఐదేళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానంలో (ఱఱ) జరిగిన కొనుగోళ్లు, టెండర్ల ప్రక్రియ, మరియు నాణ్యత నియంత్రణలో జరిగిన లోపాలపై దృష్టి సారించనుంది. ఏ పరిస్థితుల్లో నెయ్యి నాణ్యత తగ్గింది? నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగింది? అనే కోణంలో ఈ కమిషన్ నివేదిక ఇవ్వనుంది. ఇది ప్రభుత్వానికి పాలనాపరమైన సంస్కరణలు సూచించే అవకాశం ఉంది.

అసెంబ్లీ మరియు మండలిలో రగడ

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో లడ్డూ అంశం ప్రధాన అజెండాగా మారింది. వైసీపీ సభ్యులు దేవుడి చిత్రపటాలు పట్టుకుని నిరసన తెలపడం, దానికి మంత్రులు పయ్యావుల కేశవ్, నారా లోకేశ్ గట్టిగా కౌంటర్ ఇవ్వడంతో సభ దద్దరిల్లుతోంది. 'హెరిటేజ్' ప్రస్తావన వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తుండగా, ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని ప్రతిపక్షం వాదిస్తోంది.

భక్తుల ఆందోళన – ప్రభుత్వ భరోసా

ఈ వివాదం భక్తులలో తీవ్ర ఆందోళన కలిగించడంతో, ప్రభుత్వం తిరుమలలో శాంతి హోమం నిర్వహించి ప్రక్షాళన చేపట్టింది. ప్రస్తుతం కర్ణాటకకు చెందిన 'నందిని' నెయ్యిని మాత్రమే వాడుతున్నామని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. దినేష్ కుమార్ కమిషన్ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది.

ముగింపు: నిజాలు తేలేది ఎప్పుడు?

లడ్డూ వివాదం కేవలం రాజకీయ పోరాటంగానే కాకుండా, హిందూ ధర్మ పరిరక్షణ అంశంగా మారింది. ఒకవైపు న్యాయస్థానాల పర్యవేక్షణలో విచారణ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఏకసభ్య కమిషన్ విచారణ సమాంతరంగా సాగుతున్నాయి. ఈ విచారణలు పూర్తయితేనే అసలు దోషులు ఎవరు? వ్యవస్థలో లోపాలు ఎక్కడ ఉన్నాయి? అనే విషయాలు స్పష్టమవుతాయి.

# విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



బిఎన్ఎస్ ,సికింద్రాబాద్ : సీతాఫలమండీ కూడలిలో తన స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్ జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు పనులను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో నిరంతరం స్పూర్తిని రేకెత్తించేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి అదర్శాలను పాటించేలా తన వంతు కృషి చేస్తున్నానని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సీతాఫలమండీ ఎస్.సీ., ఎస్. టీ. సంఘాల నేత జీ. చంద్రశేఖర్, బీ. ఆర్. ఎస్. సమన్వయకర్త రాజా సుందర్, నాయకులు పాల్గొన్నారు.

# 'హెరిటేజ్' నోటీసులకు భయపడను..

మొదటి పేజీ తరువాయి

తిరుమల లడ్డూ నెయ్యి సరఫరాలో జరిగిన అవకతవకలపై తాము సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ప్రభుత్వం తన గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

### భక్తి పేరుతో రాజకీయం చేస్తున్నారా?

మండలిలో వైసీపీ సభ్యులు దేవుడి చిత్రపటాలు పట్టుకోవడంపై ప్రభుత్వం చేసిన విమర్శలను బొత్స తిప్పికొట్టారు. "మేము దేవుడిని అవమానించలేదు, ఆ దేవుడి సాక్షిగా ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలను ఎండగట్టడానికే ఆ పని చేశాం. పాదరక్షల ప్రస్తావన తెచ్చి భక్తిని రాజకీయం చేస్తోంది కూటమి ప్రభుత్వమే" అని ఆయన మండిపడ్డారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు.

### హెరిటేజ్ నోటీసులపై ధీటైన సమాధానం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సంస్థ అయిన 'హెరిటేజ్ ఫుడ్స్' తనకు పంపిన లీగల్ నోటీసుల గురించి బొత్స ఘాటుగా స్పందించారు. "నాకు లీగల్ నోటీసులు పంపినంత మాత్రాన నేను భయపడను. ఇందాపూర్ డైరీకి, హెరిటేజ్‌కు ఉన్న సంబంధం ఏమిటో అందరికీ తెలుసు. కేవలం ఏడాది కాలంలో హెరిటేజ్ షేర్ విలువ రూ. 300 నుంచి రూ. 700లకు ఎలా పెరిగింది? దీని వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

### ధరల పెంపుపై నిలదీత

గత ప్రభుత్వ హయాంలో నెయ్యి ధర తక్కువగా ఉండేదని, ఇప్పుడు రూ. 600లకు పైగా పెంచి కొనుగోలు చేస్తున్నారని బొత్స ఆరోపించారు. నెయ్యి ధర పెరగడం వల్ల ఎవరికి లాభం చేకూరుతోందో అర్థం చేసుకోవడం కష్టం కాదని వ్యాఖ్యానించారు. పేద ప్రజల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, దీనిపై అసెంబ్లీలో గానీ, మండలిలో గానీ ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు.



### మంత్రి అచ్చెన్నాయుడు సవాల్‌కు స్పందన

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని బొత్స ప్రకటించారు. "మేము దేనికైనా సిద్ధం. కానీ ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోంది. వైసీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధించాలని చూస్తున్నారు తప్ప, ప్రజలకు జవాబుదారీగా ఉండటం లేదు" అని ఆయన ఆక్షేపించారు. తాము అడిగిన ప్రతి ప్రశ్నకు ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

మండలిలో ప్రతిపక్షానికి కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, వాయిదా తీర్మానాలను ఏకపక్షంగా తిరస్కరిస్తున్నారని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. సభలో ప్రభుత్వం బలాన్ని ఉపయోగించి ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన అభివర్ణించారు. శాసనమండలిలో తమ గొంతు వినిపించనివ్వకపోతే, రోడ్ల మీదకు వచ్చి పోరాడుతామని స్పష్టం చేశారు.

### జైలుకు పంపినా వెనకడుగు వేయం

చివరగా, తమ పార్టీ నాయకులపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బొత్స పేర్కొన్నారు. "అంబటి రాంబాబు వంటి నేతలపై కేసులు పెట్టి జైలుకు పంపినంత మాత్రాన వైసీపీ భయపడదు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం సాగిస్తాం. తిరుమల లడ్డూ విషయంలో ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలే గమనిస్తున్నారు, వారే బుద్ధి చెబుతారు" అని తన ప్రసంగాన్ని ముగించారు.

# ఏఐ సమ్మిట్ చాలా బాగా జరిగింది

## మళ్లీ కేంద్రంపై శశిథరూర్ ప్రశంసలు



న్యూస్ డెస్క్, 20 ఫిబ్రవరి (బిఎన్ఎస్ ): కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ చాలా బాగా జరిగిందంటూ కొనియాడారు. పెద్ద కార్యక్రమాల్లో కొన్ని అవాంతరాలు జరుగుతుంటాయని.. అయినా కూడా కేంద్రం చాలా బాగా నిర్వహించిందని మెచ్చుకున్నారు.

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏఐ సమ్మిట్‌ను విమర్శించారు. "అస్తవ్యస్తమైన ప్రజా సంబంధాల ప్రదర్శన" అని అభివర్ణించారు. చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా తీవ్రంగా తప్పుపట్టారు.

ఫిబ్రవరి 17న జరిగిన శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ రోజున పొడవైన క్యూలు, భారీ జనసమూహం, లాజిస్టికల్ సమస్యలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. భద్రతా సిబ్బంది నుంచి స్పష్టమైన సూచనలు లేకుండానే గేట్లు మూసేశారని సందర్శకులు తెలిపారు. పెద్ద ఎత్తున వార్తలు హల్‌చల్ చేశాయి. అలాగే గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం వివాదానికి దారితీసింది. "ఓరియన్" అనే రోబోటిక్ కుక్కపై విమర్శలు రావడంతో ఆ విశ్వవిద్యాలయాన్ని ఎక్స్‌పో స్థలాన్ని ఖాళీ చేయమని కోరారు..

ఇదిలా ఉంటే ఏఐ సమ్మిట్ నిర్వహణను రాహుల్ గాంధీ తప్పుపడితే.. శశిథరూర్ మాత్రం అభినందించారు. "శిఖరాగ్ర సమావేశానికి వెళ్లే అవకాశం నాకు లభించకపోయినా శుక్రవారం నేను ఇక్కడ మాట్లాడుతున్నాను. నాకు అర్థమైనంత వరకు మొదటి రెండు రోజులు చాలా బాగా గడిచాయి. కొన్ని లోపాలు, కొన్ని సంస్థాగత విషయాలు ఉన్నాయి. ఇవి ఒక పెద్ద కార్యక్రమంలో జరుగుతాయి." అని శశిథరూర్ తెలిపారు.

ఇటీవలే శశిథరూర్‌తో కాంగ్రెస్ పెద్దలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై చర్చించారు. కేరళ ఎన్నికల వేళ ఇదో శుభపరిణామంగా భావించారు. మళ్లీ ఇంతలో ఏమైందో ఏమో తెలియదు గానీ.. మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని శశిథరూర్ ప్రశంసించారు.

# డిగ్రీ అధ్యాపక పోస్టులకు

## కాంగ్రెస్ బిగించిన ఉచ్చు - భర్తీలో కొత్త రూల్స్



బిఎన్ఎస్ : డిగ్రీ అధ్యాపక పోస్టుల భర్తీ కోసం గత 15 సంవత్సరాలుగా పీజీలు చదివి ఎంతోమంది కేంద్రస్థాయిలో యుజిసి నిర్వహించే అర్హత పరీక్ష నెట్లో కూడా అర్హులై లక్షల మంది నిరుద్యోగులు డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ కోసం కండ్లు కాయలు కాసే విధంగా ఎదురుచూస్తున్నారు .అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వం 31 డిసెంబర్ 2022 న 544 ఖాళీలతో డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ ను విడుదల చేసింది.

కానీ అప్పటి కొంతమంది జూనియర్ లెక్చరర్లు మాకు కూడా అవకాశం ఇవ్వాలని కోరగా టిఆర్ఎస్ ప్రభుత్వం అందుకుగాను టీజీ సెట్ ను నిర్వహించారు. టిజిసెట్ నిర్వహించి ఫలితాలు విడుదల అయ్యే సమయానికి చాలా ఆలస్యమై ఒక సంవత్సరం గడిచిపోయింది. 2023లో ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది అప్పటికే అప్లికేషన్ తీసుకోవాల్సిన డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ వాయిదా పడింది 2022లో విడుదలైన నోటిఫికేషన్ కి ఇప్పటిదాకా భర్తీ చేసే మార్గమే ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి దొరకలేదేమో. 3 వేలకు పైగా పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ 2022లో 544 పోస్టుల వివరాలు ఉంటే దానికి అదనంగా 3000 పోస్టులు పెంచి ఇవ్వొచ్చు కానీ 2026 సంవత్సరం కూడా వచ్చింది కానీ మూడు సంవత్సరాలు దాటిన ఈ నోటిఫికేషన్ జాడే లేదు. ఈ మూడు సంవత్సరాల్లో ఇయర్ క్యాలెండర్ మారింది కానీ జాబ్ క్యాలెండర్ మాత్రం లేదు.

ఇవన్నీ ఇలా ఉండంగా ఈ పరీక్షకు అర్హత విషయానికి వస్తే యూజీసీ నిర్వహించే నెట్ తెలంగాణ రాష్ట్రం నిర్వహించే టిజిసెట్లు అర్హతలుగా ఉన్నాయి. అలాగే పిజీలో 50% మార్కులు తప్పనిసరి కానీ కాంగ్రెస్ గవర్నమెంట్ మాత్రం నిరుద్యోగుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుంది . ఈ అర్హతలు సరిపోవు అన్నట్లు సరికొత్తగా G.O .NO.4 ను తీసుకొచ్చి కష్టపడి చదువుకున్న వారి స్వప్నం ను చెదిరేసే ప్రయత్నం చేస్తుంది. ఈ జీవో నెంబర్ 4 వల్ల ఎంతోమంది నష్టపోయే అవకాశం ఉంది. ఈ జీవో నెంబర్ 4 వలన కొంతమంది పెద్ద కుటుంబాలకు ,రాజకీయ స్నేహితులకే లాభం తప్ప నిరుపేద విద్యార్థికి ఒరిగేదేం లేదు. నెట్ , సెట్ అర్హతలు సాధించిన వారికే అర్హతలు ఉన్న పరీక్షకి కొత్తగా ఇన్ని రోజులు అవసరమా? ఒకవేళ ఈ రూల్స్ వర్తించాలంటే జరగాల్సిన మార్పులు ఎందుకు జరగలేదు.

జీవో నంబర్ 4 లో కొత్త రూల్స్ లు ఏమంటే అకాడమిక్ స్కోరు కి 50 మార్కులు ,

రాతపరీక్షకి 40 మార్కులు,

ఇంటర్వ్యూకి 10 మార్కులు

మొత్తం 100 మార్కులు ఇందులో అకాడమీ స్కోరు అంటే పీహెచ్డీకి 20 మార్కులు, జేఆర్ఎఫ్ సాధించిన వారికి 10 మార్కులు ,m. phil కి 10 మార్కులు ఇలా మొత్తం 50 మార్కులు ఇలా డివైడ్ చేసి మొత్తం 50 మార్కుల కేటాయించారు .

ఒకప్పుడు వంద మార్కులు రాత పరీక్ష ద్వారానే నిర్వహించేవారు .ఇప్పుడు కొత్తగా ఏ రూల్స్ పెట్టడం ఏమైనా న్యాయమేనా ?మరి పీహెచ్డీకి అంత విలువని ఇచ్చేవారు ఇన్ని మార్కులు కేటాయించిన వారు రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలో పిఎస్డి నోటిఫికేషన్ల పోస్టులు పెంచే ప్రతి సంవత్సరం ఎందుకు విడుదల చేయడం లేదు? M.phil కూడా రద్దయింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో M.phil కోర్సు లేనేలేదు. JRF అంటారా అది అందరిని ద్రాక్షనే.

ఇలా కొత్త విధానాల ద్వారా ఎవరికి లాభం ఈరోజు కాంట్రాక్ట్ లో పని చేస్తున్న వారి కోసమా, లేక రాజకీయ సుపరిచితుల కోసమా, లేక లోలోపలే గుట్టు సప్పుడు కాకుండా ఈ 50 మార్కులని అడ్డం పెట్టుకొని పోస్టులన్నీ అమ్ముకోడానికా? మిగతా 40 మార్కులు రాత పరీక్ష అది అందరికీ సమానమే అందులో ఎలాంటి సందేహాలకు తావు లేదు. ఇక ఇంటర్వ్యూ సంగతి చెప్పనక్కర్లేదు. దేనికి దీనికి 10 మార్కులు గ్రూప్ వన్ స్థాయికే లేని ఇంటర్వ్యూ డిగ్రీ స్థాయి లెక్చరర్స్ కి ఎందుకు .

ఎందుకంటే అక్కడ కూడా రాజకీయం చేసి మీకు కావాల్సినవారికి, మీరూ ఉద్యోగాలు అమ్ముకున్న వారికి మీరు ఉద్యోగాలు అమ్ముకున్న వారికి మాత్రమే ,మొకాలు చూసి బొట్లు పెట్టి ఉద్యోగాలు ఇస్తారు .ఇక్కడ ఈ దొంగ జీవో నెంబర్ నాలుగుని పుట్టించడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు అమ్మడం కోసమే .

డబ్బున్నోళ్లు డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం కొనుక్కుంటారు. ఇక్కడ చదివిన వారి పరిస్థితి ఏంటి? వారి ఎదురుచూపులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి ఇదేనా ?15 సంవత్సరాల కలగానే మిగిలిపోనుందా? ఇక ఈ డిగ్రీలు ఎందుకు ?పట్టాలెందుకు? కాబట్టే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. టీజీపీఎస్సీ బోర్డు కూడా ఈ నిబంధనలతో కూడిన జీవో నెంబర్ నాలుగుని రద్దు చేయాలని కోరుకుంటున్నాం. లేకపోతే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమం ఎగిసే అవకాశం ఉంటుంది.

# అందుకే మీకు చులకనయ్యాం

## అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఫైర్



న్యూస్ డెస్క్, 20 ఫిబ్రవరి (బిఎన్ఎస్ ): బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రెడ్డి, కాపు, వెలమ ఎవరైనా తన కాళ్ల దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం పార్టీ నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై రాకేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్బరుద్దీన్ హిందువులను హీనంగా మాట్లాడుతున్నారని అన్నారు. సిగ్గు శరం లేదని జాతి హిందువులదని అన్నారు. రెడ్డి, కాపు, వెలమ అంటూ కులాలతో విడిపోయారని అదే మీకు చులక అయ్యిందన్నారు. కానీ ఇప్పుడు హిందువులుగా మారుతున్నామని చెప్పారు. చత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువులగానే ఉంటామన్నారు. ఇంకా హిందువులను తిట్టాలని చీము నెత్తురు లేని జాతిని తిడితేనే ఏకం అవుతారని అన్నారు. హిందువులను ఓవైసీ పాములు అంటున్నాడని.. పాములైతేనే మీరు 3కోట్లనుండి 20 కోట్లు అయ్యారా అని ప్రశ్నించారు. మీరు పాములు కాబట్టే పాకిస్తాన్, బంగ్లాదేశ్ లో హిందులపై దాడులు చేశారని మండిపడ్డారు. అక్కడ పాములై కరుస్తున్నారని అన్నారు. ఇక్కడ ప్రేమతో చేరదీస్తే కాటు వేస్తున్నారని అన్నారు. ఒవైసీ బ్రదర్స్ అంటేనే హిందులకు బద్ధ శత్రువులు అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఇటీవల కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం అక్బరుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రులు రెడ్డి అయినా, రావు అయినా తమ వద్దకే రావాలని అన్నారు. ముఖ్యమంత్రుల వద్దకు తామకు వెళ్లమని చెప్పారు. పనులు కావాలన్నా, అధికారం కావాలన్నా సీఎంలే రావాలన్నారు. తమ మద్దతు లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ఎంఐఎం మద్దతు రాష్ట్రంలో కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాదని, తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకి ఉందన్నారు.

# దేవాదుల ప్రాజెక్టుపై అంత నిర్లక్ష్యం ఎందుకు?: హరీశ్‌రావు



హనుమకొండ: దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. వరంగల్ జిల్లాలో దేవాదుల పరిధి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేవాదుల పనులు నత్తనడకన నడిచాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచినట్లు చెప్పారు.

" దేవాదుల ఆయకట్టును 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మోటార్లను ఈ ప్రభుత్వం నడపలేకపోతోంది. నిర్వహణ ఖర్చులు రూ.8 కోట్లు లేక మోటార్లు నడపట్లేదు. గండిరామారంతోపాటు ఇతర లిఫ్ట్‌లు బంద్ చేశారు. దేవన్నపేట పంప్‌హౌస్‌లో 3 మోటార్లు నడవట్లేదు. మరమ్మతులకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.7,300 కోట్ల మేర దేవాదుల ప్రాజెక్టుపై ఖర్చు పెట్టాం. 80శాతానికిపైగా పనులు పూర్తి చేశాం. 47వేల ఎకరాల ఆయకట్టును.. 3.17 లక్షల ఎకరాలకు పెంచాం.

ఈ ప్రాజెక్టు కోసం 33 వేల ఎకరాలు అవసరం ఉంటే.. 30వేల ఎకరాల భూ సేకరణ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయింది. ఒకట్రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి..మిగతా 3 వేల ఎకరాల భూ సేకరణ చేస్తే.. అదనంగా 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు పెరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం కనీసం రూ.200 కోట్లు అయినా ఖర్చు చేశారా? దేవాదుల ప్రాజెక్టుపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు?" అని హరీశ్‌రావు నిలదీశారు.



# సినిమా న్యూస్



## మెగాస్టార్ తో మెగా సీక్వెల్
### కథ రెడీ చేసిన స్టార్ డైరెక్టర్

టాలీవుడ్‌లో ఓ క్రేజీ న్యూస్ వైరల్ గా మారింది. 'కల్కి 2898 ఏడీ' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి కోసం ఒక అద్భుతమైన కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఫిలిం నగర్ వర్గాల్లో ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది. నాగ్ అశ్విన్ పురాణాలను, ఫాంటసీని కలిపి వెండితెరపై ఆవిష్కరించడంలో కల్కితో తన మార్క్ చూపించాడు.

ఇప్పుడు చిరంజీవి కోసం కూడా ఒక భారీ మైథలాజికల్ నేపథ్యం ఉన్న కథను రాసుకున్నారని సమాచారం. జగదేక వీరుడు అతిలోక సుందరికి సీక్వెల్ అనికూడా టాక్ నడుస్తోంది. త్వరలోనే ఆయన మెగాస్టార్‌ను కలిసి ఈ పూర్తి కథను వినిపించనున్నారని తెలుస్తోంది. ఒకవేళ మెగాస్టార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే, తెలుగు సినీ చరిత్రలో ఇది మరో ల్యాండ్‌మార్క్ సినిమాగా నిలిచిపోవడం ఖాయం. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నిర్మించనున్నట్లు సమాచారం. ఇప్పటికే నాగ్ అశ్విన్‌తో 'ఎవడే సుబ్రహ్మణ్యం', 'మహానటి', 'కల్కి' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన అశ్వినీదత్ ఈ మెగా ప్రాజెక్ట్‌ను కూడా రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారట. చిరంజీవి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, నాగ్ అశ్విన్ లాంటి విజనరీ డైరెక్టర్ చెప్పే కథ వైవిధ్యంగా ఉంటే ఖచ్చితంగా ఓకే చెప్పే అవకాశం ఉంది. మెగాస్టార్ నటన, నాగ్ అశ్విన్ మేకింగ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు నాగి తన నెక్స్ట్ సినిమా కల్కి సీక్వెల్ పనుల్లోనూ బిజీగా ఉన్నారు.



## టాక్సిక్ టీజర్ రిలీజ్
### థియేటర్స్ తగలబడతాయేమో




కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న భారీ బడ్జెట్ టాక్సిక్. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ మధ్య యష్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ అయిన గ్లిమ్స్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక ఇప్పుడు ఈ సినిమా నుండి టీజర్ ను రిలీజ్ చేసారు మేకర్స్. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. మేకర్స్ ముందుగా చెప్పినట్టుగానే, ఈ టీజర్ ఊహించిన దానికంటే చాలా రెట్లు ఎక్కువ ఇంటెన్స్‌గా, పవర్‌ఫుల్ విజువల్స్‌తో ఉంది.

దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ చిత్రాన్ని ఒక పక్కా గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించింది. టీజర్‌లోని వయలెన్స్ మరియు షాట్స్ చూస్తుంటే, ఈ సినిమా ఖచ్చితంగా 'ఏ' సర్టిఫికేట్ పొందే రేంజ్‌లో రాబోతుందని స్పష్టమవుతోంది. మునుపెన్నడూ చూడని విధంగా యష్ బాడీ లాంగ్వేజ్ మరియు లుక్స్ ఇందులో చాలా వైల్డ్ గా ఉన్నాయి. ఈ టీజర్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గురించి. ప్రతి సన్నివేశాన్ని ఎలివేట్ చేసే విధంగా రవి బాస్రూర్ ఇచ్చిన సంగీతం అదిరిపోయింది. విజువల్స్ విషయానికి వస్తే, కొన్ని షాట్స్ అత్యున్నత ప్రమాణాలతో షూట్ చేశారు. సినిమాటోగ్రఫీ మరియు కలర్ గ్రేడింగ్ సినిమా మూడ్‌కు తగ్గట్టుగా చాలా డార్క్‌గా, ఇంటెన్స్‌గా ఉన్నాయి. మొత్తానికి 'కేజీఎఫ్' తర్వాత యష్ నుంచి వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మరో సునామీ సృష్టించడం ఖాయమనిపిస్తోంది.



## ప్రేమపై ఓపెన్ అయిన ప్రభాస్

టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెళ్లి గురించి గత కొంత కాలంగా ఎన్నో వార్తలు వస్తూనే ఉన్నాయి. అనుష్క నుండి కృతి సనన్ వరకు ఎంతో మంది హీరోయిన్ల పేర్లు వినిపించినా.. ప్రభాస్ మాత్రం ఎప్పుడూ తన నవ్వు తోనే సమాధానం దాటవేస్తూ వచ్చారు. కానీ తొలిసారిగా ఆయన తన మనసులోని అసలు కోరికను బయటపెట్టి ఫ్యాన్స్‌కు పెద్ద సర్ప్రైజ్ ఇచ్చారు. రీసెంట్‌గా విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, ఆ మూవీ టీమ్‌తో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఇంటర్వ్యూలో హీరోయిన్ మానస వారణాసి చమత్కారంగా 'ప్రేమపై మీ అభిప్రాయం ఏంటి డార్లింగ్?' అని అడిగేసరికి ప్రభాస్ కాసేపు సిగ్గుపడ్డారు.

'ఇది నీ పర్సనల్ క్వశ్చన్ కదా' అంటూనే, ఎవరూ ఊహించని సమాధానం ఇచ్చారు. "నిజం చెప్పాలంటే నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన ఫీలింగ్‌ను అనుభవించాలని ఉంది. ఆ మూమెంట్ కోసం నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాను " అని ప్రభాస్ చెప్పారు. ఈ మాట వినగానే అటు ఇంటర్వ్యూ చేస్తున్న టీమ్, ఇటు సోషల్ మీడియాలో నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇప్పటి వరకు పెళ్లి అంటే తప్పించుకునే ప్రభాస్, ఇప్పుడు ప్రేమించాలని ఉంది అని చెప్పడం వెనుక ఏదైనా బలమైన సంకేతం ఉందా అని చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభాస్ వయస్సు 46 ఏళ్లు.

ఆయన వయసు హీరోలంతా పెళ్లిళ్లు చేసుకుని సెటిల్ అయిపోయినా, ప్రభాస్ మాత్రం బాక్సాఫీస్ రికార్డులను వేటాడటంలోనే బిజీగా ఉన్నారు. అయితే తాజా కామెంట్స్ చూస్తుంటే, డార్లింగ్ త్వరలోనే తన జీవితంలోకి ఒక కొత్త వ్యక్తిని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. మరి ఆ సమయం ఎప్పుడు వస్తుంది? ప్రభాస్ మనసు గెలుచుకునే ఆ రాణి ఎవరు? అన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. డార్లింగ్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన భారీ లైనప్‌తో తీరిక లేకుండా గడుపుతున్నారు. సలార్-2, స్పిరిట్, ఫౌజీ, కల్కి-2 వంటి చిత్రాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ చిన్న సినిమాలకు తనవంతు సపోర్ట్ ఇస్తున్నారు.

## ఆ సినిమా చేసినందుకు బాధపడుతున్నాను
### -భానుప్రియ



తెలుగు సినిమా పరిశ్రమలో ఒకానొక సమయంలో స్టార్ హీరోయిన్లలో ఒకరిగా ఓ వెలుగు వెలిగిన నటీమణులలో భానుప్రియ ఒకరు. ఈమె ఆ సమయంలో స్టార్ హీరోలుగా కెరీర్ను కొనసాగించిన ఎంతోమంది నటులతో నటించింది. ఈమె గొప్ప డాన్సర్, తన డాన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి అద్భుతమైన క్రేజ్ ఉన్న ఈ నటి కొంతకాలంగా సినిమాల సంఖ్యను చాలా వరకు తగ్గించింది. తాజాగా ఈమె నాట్యం అనే సినిమాలో నటించింది.

చాలా కాలం గ్యాప్ తర్వాత నటించిన సినిమా కావడంతో ఇందులో భానుప్రియ పాత్ర అద్భుతంగా ఉంటుందని చాలామంది భావించారు. అలా ఎక్స్పెక్ట్ చేసిన జనాలకు ఈ సినిమా ఆనందాన్ని కలిగించలేదు. తాజాగా భానుప్రియ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో భాగంగా నాట్యం సినిమా గురించి, అందులో తన పాత్ర గురించి అనేక విషయాలను తెలియజేసింది. తాజాగా భానుప్రియ మాట్లాడుతూ... "నేను రీసెంట్ గా నాట్యం సినిమా చేశాను. కానీ అది నాకు ఆనందాన్ని ఇవ్వలేదు.

అందుకు ప్రధాన కారణం మొదటగా ఆ సినిమాలో నాకు పాత్రను ఆఫర్ చేసిన టైంలో కథ చెప్పారు, అప్పుడు అద్భుతంగా ఉంది. ఒక కూతురిని ప్రోత్సహించే తల్లి పాత్రలో ఎంతో గొప్పగా అనిపించింది. ఆ తరువాత సినిమా స్టార్ట్ అయ్యి, పూర్తయ్యేసరికి నాకు చెప్పిన కథకు అక్కడ ఉన్నదానికి సంబంధం లేకుండా పోయింది. ఇక నా అభిమానులు కూడా ఆ సినిమా విషయంలో నిరుత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఆ సినిమా చేసినందుకు నేను కూడా ఫీలవుతున్నాను" అని భానుప్రియ తాజాగా కామెంట్ చేసింది.